క్లుప్తంగా

కేఫా మందిరం ప్రతిష్ట



ప్రార్థనలు చేస్తున్న దైవ సందేశకులు టీ.జెఫన్యా

కర్నూలు (టౌన్): స్థానిక జొహరాపురంలో నూతనంగా నిర్మించిన కేఫా మందిర ప్రతిష్ట మహోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన దైవ సందేశకులు పాస్టర్ టీ.జెఫన్యా అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా దైవ సందేశకులు మాట్లాడుతూ.. జొహరాపురం ప్రాంత ప్రజల కోసం ఇక్కడ మందిరం ఏర్పాటు చేశామన్నారు. పాస్టర్లు రవికుమార్, ఫిలిప్, సద్గుణరాజు, భాస్కర్, జాన్, తిరుపాల్, లాజర్ పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ



వాల్మీకి విగ్రహావిష్కరణ చేస్తున్న అతిథులు

కల్లూరు: మండల పరిధిలోని వామసముద్రం గ్రామంలో శనివారం వాల్మీకి మహర్షి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, వాల్మీకి సంఘం నాయకులు కుబేర స్వామి, బేతం కృష్ణుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వాల్మీకులకు ఎస్టీ హోదా కల్పిస్తే సామాజికంగా, ఆర్థికంగా ఎదుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సేవా సంస్థ అధ్యక్షులు కొల్లాయి పెద్దయ్య, విష్ణు, శేఖర్, చిన్న గోకారి, రంగడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన సాయికుమార్

ఓర్వకల్లు: మండలంలోని ఉయ్యాలవాడ, ఉప్పలపాడు గ్రామాల మధ్య శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు కుమారుడు బోయ సాయికుమార్(25) హైదరాబాద్‌లో పాలీష్ కట్టర్‌గా జీవనం సాగిస్తూ, తల్లితండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఇటీవల స్వగ్రామం ఉయ్యాలవాడకు వచ్చాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పనిమీద సాయంత్రం బైక్‌పై గ్రామం నుంచి హుసేనాపురం వెళ్లి తిరిగి తిరిగి వస్తుండగా ఉప్పలపాడు గ్రామం వద్ద బైక్ అదుపు తప్పడంతో కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఓర్వకల్లు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు లలితాదేవి మహోత్సవం

కర్నూలు కల్చరల్: కర్నూలు శ్రీమాతా సత్సంగం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నగర శివారులోని కేఎస్ఆర్ కన్వెన్షన్‌లో లలితా దేవి మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీలలితా పీఠం పీఠాధిపతులు గురు మేడా సుబ్రహ్మణ్యం సందేశమిస్తారని పేర్కొన్నారు. లలితా పీఠం కుటుంబ సభ్యులు, హిందువులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ఎంపీఎం రెడ్డి సంస్మరణ సభ

కర్నూలు కల్చరల్: సుప్రసిద్ధ శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీఎం రెడ్డి సంస్మరణ సభను ఆదివారం ఉదయం 10.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు తెలుగు కళా స్రవంతి అధ్యక్షుడు ఇనాయతుల్లా తెలిపారు. అరుణ భారతి అధ్యక్షుడు బీసీ రాజారెడ్డి, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. సాహితీ ప్రియులందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

సాక్షి సినిమాలు



ఎస్వీసీ కాంప్లెక్స్ : ఛావా, కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ, దిల్‌రుబా, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్, ఆఫీసర్ ఆన్ డ్యూటీ, యుగానికి ఒక్కడు (2010)
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : యుగానికి ఒక్కడు (2010), కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్, ఆఫీసర్ ఆన్ డ్యూటీ, దిల్‌రుబా, తండేల్, మజాకా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ఛావా, కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ, దిల్‌రుబా
శ్రీరామ : ఛావా
రాజ్ : యుగానికి ఒక్కడు (2010)
భరత్ కాంప్లెక్స్ : తండేల్,1000 వాలా
విజయ థియేటర్ : మజాకా
విక్టరీ టాకీస్ : మజాకా

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం



చీపుర్లతో ఊడ్చుతున్న ప్రిన్సిపల్ కార్యదర్శి, కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, కమిషనర్



స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపల్ కార్యదర్శి కాంతిలాల్ దండే

కర్నూలు (టౌన్): ప్లాస్టిక్ వాడాకాన్ని నిర్మూలిద్దామని రహదారులు, భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ ఆఫీసర్ కాంతిలాల్ దండే పిలుపునిచ్చారు. నగరంలోని కొండారెడ్డి బురుజు ఎదురుగా ఉన్న ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు, ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కార్పొరేషన్ రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ప్లాస్టిక్ ఫ్రీ భోజన ప్లేట్లు, నేలను శుభ్రం చేసే ప్లాస్టిక్ ఫ్రీ మ్యాట్స్‌లు తదితర వస్తువులను ప్రిన్సిపాల్ కార్యదర్శి తిలకించారు. ఆడిటోరియంలో మొక్కలు నాటారు. కొండారెడ్డి బురుజు వద్ద రోడ్లను శుభ్రం చేశారు.
ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కార్యదర్శి మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిందని, దీని వల్ల ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయన్నారు. మనం తినే ఆహారంలో ప్లాస్టిక్ అవశేషాలు ఉండిపోయి అనేక రకాల జబ్బులు వస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా చేతి సంచులను వాడాలన్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ.. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నివారించండి- పునర్వినియోగాన్ని ప్రోత్సహించండి అన్న అంశంతో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలు, వార్డుల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్ వల్ల నేల, నీరు కలుషితం అవుతున్నాయని, వాటి వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుదామని పిలుపునిచ్చారు. ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, రోడ్డు, భవనాల శాఖ ఎస్ఈ మహేశ్వర రెడ్డి, ఈఈ సురేష్, డీటీసీ శాంతికుమారి, ఆర్డీఓ బర్హత్ చౌహాన్, హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వర రెడ్డి, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): పరిసరాలు శుభ్రంగా ఉంటేనే అందరం ఆరోగ్యంగా ఉంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో భాగంగా కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛత దివస్‌గా పరిగణిస్తూ ఈ నెల ×స్వచ్ఛ ఆసుపత్రి–ఆరోగ్యానికి మైత్రి, పరిసరాల పరిశుభ్రత అనే నినాదాలతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రోగ్రామ్ అధికారులు, కార్యాలయ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యాలయ పరిపాలన అధికారిణి అరుణ, స్టాటిస్టికల్ ఆఫీసర్ హేమసుందరం, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, డిస్ట్రిక్ట్ ఎపిడమాలజిస్టు వేణుగోపాల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో...

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రిలోని గాంధీ విగ్రహం వద్ద అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలోని పలు విభాగాలను శుభ్రం చేశారు. ఆసుపత్రి ఆవరణ, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ల వద్ద మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని నినదించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, డాక్టర్లు సీఎస్‌కే ప్రకాష్, హేమనళిని, రామశివనాయక్, శివబాలనాగాంజన్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. వర్సిటీ ప్రాంగణంలోని ఇంజినీరింగ్ కళాశాల, ఓపెన్ ఎయిర్ థియేటర్ ఆడిటోరియం పరిసరాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వెంకట బసవరాజు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాదరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్

కర్నూలు: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవాలని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ సూచించారు. నగరంలో పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులను తీసుకెళ్లే బస్సులు, ఆటోడ్రైవర్లకు రహదారి భద్రత నిబంధనలపై నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వక్కెరవాగు వద్ద ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. వాహనం నడిపే సమయంలో డ్రైవర్లు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, పాఠశాల బస్సులకు పనిచేసే డ్రైవర్లకు కచ్చితంగా 5 సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని సూచించారు. అత్యవసర, ప్రమాద సమయాల్లో ఎలాంటి భద్రత, జాగ్రత్త చర్యలు తీసుకోవాలో వివరించారు.

రక్తదానాన్ని ప్రోత్సహిద్దాం



రక్తదాతలను అభినందిస్తున్న ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): రక్తదానం వల్ల ఒకరి ప్రాణా న్ని కాపాడవచ్చు. 'రక్తదానాన్ని ప్రోత్సహిద్దాం - ప్రాణాలను కాపాడదాం' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక హనీ డిజిటల్ స్టూడియో ఆధ్వర్యంలో కె.ఆర్.పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్వీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని దానాల కన్నా రక్తదానం చేయడం గొప్పదన్నారు. యువత రక్తదానం చేసేందుకు ముందుకురావడం అభినందించదగ్గ విషయమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, కార్యదర్శి లాజర్, కంటూ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాలు



మాట్లాడుతున్న వై.నగేష్

కర్నూలు(సెంట్రల్): మార్చి 22 నుంచి 28వ తేదీ వరకు భగత్‌సింగ్ వర్ధంతి వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ పిలుపునిచ్చారు. శనివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని వారం రోజుల పాటు సభలు, సమావేశాలు, కాగడా ల ప్రదర్శలను చేపట్టాలన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయసులోనే నవ్వు తూ ఉరి కంభం ఎక్కిన ఘనత భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్, హుస్సేన్‌బాషా, ప్రకాష్, శ్రీనివాసులు, మహేష్, వెంకటేశ్, శిరీష్ పాల్గొన్నారు.

కాన్షీరామ్ ఆశయ సాధనకు కృషి



కాన్షీరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా నేతలు

కర్నూలు(అర్బన్): బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాడాలని సూచించిన కాన్షీరామ్ ఆశయ సాధనకు పునరంకితం కావాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. కాన్షీరామ్ 91వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి మహిళా నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాన్యశ్రీ కాన్షీరామ్ మహిళల పక్షపాతి అని, ఒక మహిళను ముఖ్యమంత్రిని చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. నీతి, నిజాయితీ, ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనమన్నారు.

బీసీ, డీఎన్‌టీ హాస్టళ్లను పునఃప్రారంభించాలి

కర్నూలు (అర్బన్): నగరంలో మూతపడిన ప్రభుత్వ బీసీ, డీఎన్‌టీ బాలుర వసతి గృహాలను పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టాలని పలు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కోరారు. శనివారం ఇక్కడకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జ్ అధికారి, ఆర్అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండేను ఆయా సంఘాల నాయకులు ఎం.రాంబాబు, ఆర్.చంద్రప్ప తదితరులు కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. స్థానిక బీ క్యాంప్‌లో ఈ రెండు వసతి గృహాల్లో దాదాపు 600 మంది విద్యార్థులు వసతి పొందుతుండేవారన్నారు. అయితే ఆర్అండ్‌బీ క్వార్టర్లలో ఉన్న ఈ వసతి గృహాలకు సంబంధించిన గదులు పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరడంతో వసతి గృహాలను తాత్కాలికంగా మూసివేశారన్నారు. బీసీ విద్యార్థుల చదువును దృష్టిలో ఉంచుకొని వెంటనే వసతి గృహాలను పునఃప్రారంభించాలన్నారు. నాయకులు పీజీ వెంకటేష్, కుమ్మరి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

దర్గా ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి



వక్ఫ్‌బోర్డు అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలో శనివారం గందరగోళం నెలకొంది. ఇటీవల దర్గాలను 11 నెలలు 15 రోజుల పాటు రూ.90 లక్షలకు నిర్వహణ టెండర్‌ను దక్కించుకున్న బిడ్డర్ షాఫీర్‌ఖాన్‌కు దర్గాలను అప్పగించేందుకు వచ్చిన వక్ఫ్‌బోర్డు అధికారులను గ్రామస్తులు నిలదీశారు. టెండర్ పొందిన షాఫీర్‌ఖాన్‌తో పాటు గ్రామస్తులు సర్దార్, బంధప్ప, సర్దార్‌భాష, రంగస్వామి, జాకీర్, చిదానంద, ఎంపీటీసీ బసప్ప తదితరులు దర్గాల ఆస్తుల విషయంలో వక్ఫ్‌బోర్డు అధికారులు ఈఓ ఇమ్రాన్‌బాషా, ఆదోని డివిజన్ వక్ఫ్‌బోర్డు ఆడిటర్ అండ్ ఇన్‌స్పెక్టర్ సుహెల్‌తో వాగ్వాదానికి దిగారు.అన్నదాన క్షత్రంలోని సామగ్రి, మరుగుదొడ్లను తమకు అప్పగించాలని లేదా వక్ఫ్‌బోర్డు స్వాధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటికే అక్కడకు చేరుకున్న ఆలూరు ఎస్ఐ దిలీప్‌కుమార్ కలగజేసుకుని శాంతభద్రతలకు విఘాతం కలగకుండా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అన్నదాన కేంద్రంలోని సామగ్రిని టెండర్‌దారుడికి అప్పగిస్తామని. మరుగదొడ్ల విషయంలో నకిలీ పత్రాలతో స్థలం మాదని కొందరు అంటున్నారని, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వక్ఫ్‌బోర్డు అధికారులు తెలిపారు. ఎట్టకేలకు రెండు దర్గాలు, 38 రూములు, చందాపట్టి, చర్మ సేకరణ, చెకెర, హేర్ కటింగ్ తదితర వాటి నిర్వహణను షాఫీర్‌ఖాన్‌కు అప్పగించారు. అయితే టెండర్‌లో రెండు దర్గాల్లోని హుండీలు, స్కిన్ సేకరణ వక్ఫ్‌బోర్డు పరిధిలో ఉంటాయన్నారు.

● సూర్య భగవానుడికి సుగంధ ద్రవ్యాభిషేకం



సూర్యనారాయణ స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

కర్నూలు కల్చరల్: నగరంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఫాల్గుణ మాసం మీన సంక్రమణం పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్య నారాయణునికి సుగంధ ద్రవ్యాలచే అభిషేకం, పంచామృతాభిషేకం, అర్చనలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య ప్రసాదం పంపిణీ



సంతాన సాఫల్య ప్రసాదం పంపిణీ చేస్తున్న పూజారులు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో స్వాయంభుగా వెలసిన చెన్నసోమేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం చక్రస్నానంతో ముగిశాయి. స్వామి వారి ఉత్సవాలను ఎనిమిది రోజులపాటు భక్తులు వైభవంగా నిర్వహించారు. చివరిరోజు కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఉదయం ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సంతాన సాఫల్య ప్రసాదం పంపిణీ చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భారీఎత్తున తరలివచ్చిన భక్తులు వేచి ఉండి స్వామివారి ప్రసాదం పొందారు. ప్రసాదం తీసుకున్న వారికి నియమ, నిష్ఠలను అర్చకులు తెలియజేశారు. మధ్యాహ్నం వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించి ఆలయ ఆవరణలో ఉత్సవ విగ్రహాలపై రంగులు చల్లి వసంతోత్సవం సంబరంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం ఉత్సవ కంకణాల వితరణను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం చెన్నసోమేశ్వర, పార్వతి, గంగాదేవి ఉత్సవ విగ్రహాలను అర్చకులు పల్లకీలో ఉంచి గ్రామంలో మేళతాలాలతో ఊరేగించారు. అనంతరం దేవతామూర్తుల విగ్రహాలను గ్రామంలోని అమ్మవారి బావికి తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. చక్రస్నానంతో ఉత్సవాల తంతు ముగిసిందని ఆలయ ధర్మకర్త పద్మనాభరెడ్డి తెలిపారు. ఉత్సవాలు విజయవంతంగా ముగియడంపై భక్తులు, గ్రామస్తులు, పోలీస్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

హంతకుల కోసం పోలీసుల వేట

- తాత్కాలిక దర్యాప్తు అధికారిగా ఇన్‌చార్జ్ డీఎస్పీ
- హతుడిపై రౌడీషీట్, పీడీ యాక్ట్ లేవని చెప్పిన పోలీసులు

కర్నూలు: నగర శివారులోని శరీన్‌నగర్‌లో టీడీపీ నాయకుడు సంజన్న హత్యకేసులో నిందితుల కోసం పోలీసులు వేట ప్రారంభించారు. కర్నూలు ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసాచారిని తాత్కాలిక దర్యాప్తు అధికారిగా ఉన్నతాధికారులు నియమించారు. దీంతో మూడు పోలీసు బృందాలు రంగంలోకి దిగి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హంతకులు రెండు వాహనాల్లో పారిపోతుండగా హ్యాంగ్‌ఔట్ హోటల్ సమీపంలో ఒక వాహనం టైరు పేలడంతో వాటిని అక్కడే వదిలేసి పరారయ్యారు. ఈ వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాలనీలో వడ్డె రామాంజనేయులు అలియాస్ అంజి, హతుడు సంజన్న కుటుంబాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. పాత కక్షల నేపథ్యంలో ప్రత్యర్థులు సంజన్నను అంతమొందించినట్లు పోలీసులు భావిస్తున్నారు. అయితే ఆయనపై రౌడీషీట్, పీడీ యాక్ట్ వంటివి లేవని పోలీసులు తెలిపారు

వడ్డె అంజి, కుటుంబ సభ్యులపై కేసు నమోదు

హత్యకు గురైన టీడీపీ నాయకుడు సంజన్న కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే కాలనీకి చెందిన వడ్డె రామాంజనేయులు అలియాస్ అంజితో పాటు ఆయన కుమారులు రేవంత్, శివ, కుమార్, భార్య సావిత్రమ్మ, అల్లుడు వీరేష్‌తో పాటు మరికొంత మందిపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. మృతదేహానికి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రెండు ముఠాల మధ్య తలెత్తిన వివాదం హత్యకు దారి తీయడంతో పోలీసులు అప్రమత్త మై శరీన్‌నగర్‌లో హతుని ఇంటి వద్ద, నిందితుల ఇళ్ల వద్ద, పోలీస్ ఔట్ పోస్టు వద్ద పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. హంతకులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హతుని కుటుంబ సభ్యులు దళిత సంఘాల నాయకులతో కలిసి శనివారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద కొద్దిసేపు ధర్నా నిర్వహించారు.

నేడు విద్యుత్ కోత

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ సబ్‌స్టేషన్లలో అభివృద్ధి పనులు, లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా ఆదివారం వివిధ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కర్నూలు టౌన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. కిడ్స్ వరల్డ్ పార్క్ నుంచి ఓల్డ్ కంట్రోల్ రూము వరకు, వడ్డేగేరిలో కూడా విద్యుత్ కోతలు ఉంటాయని పేర్కొన్నారు. ఏపీ ట్రాన్స్ కో అధికారులు లైన్‌ల కండక్టర్ రిప్లేస్‌మెంటు వర్క్ (గూడూరు) చేస్తున్నందున మరిన్ని ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు కోతలు ఉంటాయన్నారు. అలాగే దూపాడు, రాగమయూరి టౌన్‌షిప్, తిరుమలగిరి, భారత్ గ్యాస్, లక్ష్మీపురం, వెంగన్న బావి, ఆర్‌టీసీ కాలనీ, రామచంద్ర నగర్, రామకృష్ణ నగర్, కృష్ణానగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

ప్రేమికులు ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: ఆదోని పట్టణ శివారులో కర్ణాటకకు చెందిన ఇద్దరు ప్రేమికులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం కురుగోడు పట్టణానికి చెందిన ఓ యువకుడు, బాదామికి చెందిన ఓ యువతి ఐదేళ్ల క్రితం వాట్సాప్ గ్రూప్‌లో పరిచయమయ్యారు. తర్వాత అది కాస్త ప్రేమగా మారింది. అయితే, సదరు యువతిని ఇటీవల కుటుంబసభ్యులు వేరే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. ఈ పెళ్లి ఇష్టం లేని ఆ యువతి ప్రేమించిన యువకుడితో కలిసి ఈనెల 11వ తేది కొత్తాళానికి చేరుకున్నారు. అమ్మాయి బంధువులకు ఈ విషయం తెలియడంతో కురుగోడుకు వెళ్లి గొడవ చేశారు. దీంతో తమను ఎలాగైన విడగొడుతారనే భయంతో ప్రేమికులిద్దరు కలిసి శనివారం రాత్రి ఆదోని పట్టణ శివారుకు చేరుకుని పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఇరువురిని చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తలలు బయట పెట్టి కేరింతలు



వాహనంపై ప్రమాదకరంగా..



పేపర్లు చించివేస్తూ...



చదువు సరే.. సంస్కారం?

అరుపులు.. ఈలలు.. వాహనాల్లో నుంచి చేతులు, తలలు బయట పెట్టి కుప్పి గంతులు.. ఇంటర్మీడియెట్ పరీక్షలు జరిగిన రోజుల్లో కనిపించిన దృశ్యాలు ఇవీ.. ఇక పరీక్షల చివరి రోజు చేసిన హంగామా అంతా ఇంతా కాదు. అసలు విద్యాసంస్థలు చదువు నేర్పేందుకే పరిమితమా? సంస్కారం నేర్పించడం అందులో భాగం కాదా? తల్లిదండ్రులు ఏం చేస్తున్నట్లు? అనే ప్రశ్నలు దారిన వెళ్లే ప్రతి ఒక్కరిలో వ్యక్తమయ్యాయి. అసలే కిక్కిరిసిన వాహనాలలో ఇరుక్కుపోయిన ప్రయాణికులకు విద్యార్థుల అరుపులు, వెకిలి చేష్టలు విసుగు తెప్పించాయి. ఇంటర్‌తోనే చదువు పూర్తి కాదు.. జీవితంలో సాధించాల్సింది చాలా ఉంది.. ఇప్పుడు పూర్తయిన ఇంటర్మీడియెట్ విద్యాభ్యాసంలో ఒక భాగం మాత్రమే. అంతమాత్రాన రోడ్డున పోయే వారందరినీ ఇబ్బందులకు గురిచేయడం పట్ల ప్రతి ఒక్కరూ వేలెత్తి చూపించారు. ఆ చూపిన వేళ్లు విద్యార్థులకు మాత్రమే కాదు. చదువు చెప్పిన గురువులకు, సభ్యత నేర్పని తల్లిదండ్రులకు..!

– ఫొటోలు: వడ్డే శ్రీనివాసులు, సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు